

శ్రీరస్తు

కాళిదాస కృత అశ్వధాటీ స్తుతి

(దేవీ ప్రణవశ్లోకీ స్తుతి / దేవీ దశ శ్తోకీ స్తుతి)

శుభమస్తు

- భావార్థముతో -

అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్, 3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



Kiron Type Institute

కాళిదాస కృత అశ్వధాటీ స్తుతి - భావార్థముతో -

(దేవీ ప్రణవ శ్లోకీ స్తుతి / దేవీ దశ శ్లోకీ స్తుతి)

01. చేటీ భవ న్నిఖిల ఖేటీ కదంబ వన వాటీషు నాకి పటలీ
కోటీర చారుతర కోటీ మణీకిరణ కోటీ కరంబిత పదా।
పాటీర గంధి కుచ శాటీ కవిత్వ పరిపాటీ మగాధిప సుతా
ఘోటీఖురా దధిక ధాటీ ముదార ముఖ
వీటీర సేన తనుతామ్॥

దేవతా లోకంలోని స్త్రీలందరూ ఆ జగన్మాతకు చెలికత్తెలే! ఆ దేవికి వారితోడి నిత్యవిహారం కదంబవనం లోనే! సర్వదేవతలూ శిరసులు వంచి ఆమెకు పాదాభి వందనం చేస్తుంటారు. అప్పుడు వారి కిరీటాలలోని వివిధ మణి కాంతులు ప్రసరించి ఆమె పాద పద్మాలు రాగరంజితమవుతాయి. తన వక్షోజాలకు అనులేపనమైన హరిచందనంతో తడిసి ఆమె స్తనవల్కలం సువాసనలు గుబాళిస్తుంది. ఆమె సర్వగుణ సంపన్న. ఆమె సేవించిన తాంబూలంతో పరిసరాలు పరిమళిస్తాయి. ఆ తాంబూల రసం అశ్వధాటిని మించిన ఆశుకవితా శక్తిని ప్రసాదిస్తుంది. అటువంటి మహిమోపేతమైన ఆ తాంబూల రసాన్ని సేవించే ఆ పార్వతీదేవి నాకు ఉత్తమ కవితా శక్తిని ప్రసాదించు గాక!

సకల దేవతా స్త్రీలు జననికి సహచరులు కాగా, కడిమి చెట్ల ఉద్యాన వనంలో విహరిస్తూ, దేవతల కిరీటములపై గల రత్నముల కాంతులు అమ్మ పాదాలపై ప్రసరిస్తుండగా, చందనపు సుగంధంతో ప్రకాశించు వక్షస్థానం కలది, నోటిలోని తాంబూల రసము యొక్క సుగంధము నలు దిశల వ్యాపిస్తుండగా వెలిగే ఈశాని నాలోని కవిత్వ శక్తిని పెంపొందించమని ప్రార్థిస్తున్నాను.

- - - --- - - -

02. ద్వైపాయన ప్రభృతి శాపాయుధ త్రిదివ సోపాన ధూళిచరణా
పాపాపహా స్వమను జాపానులీన జన తాపాపనోద నిపుణా।
నీపాలయా సురభి ధూపాలకా దురిత
కూపాదుదంచయతు మామ్
రూపాధికా శిఖరి భూపాల వంశమణి దీపాయితా భగవతీ॥

పార్వతీదేవి పాదరేణువులు పరమ పవిత్రమైనవి. శాపాయుధులైన వ్యాసాది మహర్షులకు సైతం అవి ముక్తి సోపానాలు. మహత్తరమైనది ఆమె మంత్ర జపం. పరవశంతో తన మంత్రాన్ని జపించే భక్తుల పాపాలను ఆమె పటాపంచలు చేస్తుంది. వారికి శుభ పరంపరలను ప్రసాదిస్తుంది. కడిమి వనం ఆమెకు నిత్యనివాస ప్రదేశం. అనునిత్యం తన శిరోజాలను ధూప ధూమాలతో పరిమళింపచేస్తుంది. ఆమె సుగుణశీల. మహోన్నతుడైన తన తండ్రి హిమవంతుడి ఇంటికి మణిదీపంలా వెలుగుతూ పెరిగింది. ఆ పార్వతీ దేవి నన్ను ఈ సంసార కూపం నుండి వెలువరించుగాక!

శాపాయుధులైన వ్యాసాది మునులు సైతం మాహేశ్వరి పాద ధూళిని శిరసున ధరిస్తారు. ఈ తల్లి మంత్రజపాన్ని మనఃపూర్వకంగా చేసేవారియొక్క సమస్త పాపాలను ఆమె పటాపంచలు చేసి వారికి సమస్త సన్మంగళాలను ప్రసాదిస్తుంది. కడిమి వనంలో సంచరిస్తూ, ధూపము, ధూమములతో కేశ సంపద పరిమళాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ, తన పుట్టింట మణిదీపంలా ప్రకాశించిన పార్వతీ మాత నన్ను ఈ సంసార సాగరం నుండి తరింపచేయుగాక.

- - - --- - - -

03. యాऽళీభి రాత్మ తనుతాऽలీన కృత్ప్రియక పాళీషు
ఖేలతి భవ
వ్యాళీనకుల్య సిత చూళీభరా చరణధూళీ లసన్మణిగణా।

యాऽళీ భృతి శ్రవసి తాళీదళం వహతి యాऽళీక
శోభి తిలకా
సాऽళీ కరోతు మమ కాళీ మన స్స్వపద
నాళీకసేవన విధా॥

కాళికాదేవి చెలికత్తెలతో కలసి విలాసంగా కడిమి తోటలలో విహరిస్తుంది. సంసారమనే మహా కాల సర్పాన్ని మట్టుబెట్టే భయంకరమైన ఆడు ముంగిస లాంటిది ఆమె. నిగ నిగలాడే నల్లటి కేశ పాశంతో ఆమె శోభిస్తుంది. నిత్యం ఆమెకు మునిగణాలు పాదాభివందనాలు చేస్తాయి. ఆమె పాదరజస్సు సోకి ఆ మునులు తేజోమూర్తు లౌతారు. భర్త క్షేమాన్ని కాంక్షించి ఆమె మంచి మంచి కర్ణాభరణాలను ధరిస్తుంది. నుదుట దిద్దిన తిలకంతో ఆమె వెలుగొందుతుంది. తన పాద నీలోత్పల సేవా మకరందాన్ని నిత్యం ఆస్వాదించే తుమ్మెదలాగా, ఆమె నా మనస్సును మలుచును గాక!

సంసారమనే భయంకర కాల సర్పాన్ని సంహరించే ఆడు ముంగిసలాగ, మెరిసి పోయే కేశములతో ప్రకాశిస్తూ, కడిమి వనంలో తన సహచర స్త్రీలతో విహరించే తల్లికి సమస్త మునులు నిత్యం పాదాభివందనం చేస్తారు. తన భర్త మంగళాన్ని ఆశించే ఆమె తాటంకముల వంటి అనేక ఆభరణాలు ధరిస్తుంది. నుదుట దిద్దిన తిలకంతో ఆ తల్లి ప్రకాశిస్తుంది. ఆమె పాదపుష్పాలలోని మకరందాన్ని ఆస్వాదించే భ్రమరం లాగా జగన్మాత నన్ను ఆశీర్వదించుగాక.

- - - - --- - - -

04. బాలామృతాంశు నిభ ఫాలా మనా గరుణ చేలా
నితంబ ఫలకే
కోలాహల క్షపిత కాలామరాకుశల కీలాల శోషణ రవిః।
స్థూలాకుచే జలద నీలాకచే కలిత లీలా కదంబ విపినే
శూలాయుధ ప్రణతిశీలా దధాతు హృది
శైలాధిరాజ తనయా॥

జగదంబ పార్వతీదేవి కదంబ వనంలో చెలులతో కలిసి విలాసంగా విహరిస్తుంది. ఆమె ముఖశోభ లేత చంద్రుడిలాగా ప్రశాంతంగా ఉంటుంది. ఆమె లేత అరుణ వర్ణం గల చీరను ధరిస్తుంది. దేవతల కష్టాల కడలిని సూర్యమండలమై ఇనికింప జేస్తుంది. నల్లని కేశ సంపదతో పీనోన్నతమైన స్తన మండలంతో ఆమె శోభిస్తుంది. ఆమెకు భర్త అయిన పరమేశ్వరుడు నిరంతర దుష్ట శిక్షణ తత్పరుడు. ఆయనకు నిత్యం ప్రణమిల్లుతుంది పార్వతి. ఆమె సదాచార సంపన్న. ఆ పార్వతీ దేవి స్థిరంగా నా హృదయంలో నివసించును గాక!

కదంబవన విహారిణిగా, చంద్రునిబోలిన ప్రశాంతమైన ముఖముతో, అరుణవర్ణ వస్త్రమును ధరించి, దేవతలయొక్క కష్టములు అనే సముద్రాన్ని తీక్షణమైన తన కిరణాలతో ఆవిరి చేస్తూ, నల్లని కేశపాశములతో, ఉన్నతమైన మాతృ స్థానములతో, తన భర్తయైన ఈశ్వరునికి నిత్యం ప్రణామం చేసే, పవిత్ర స్త్రీ మూర్తియైన పార్వతీ దేవి నా హృదయములో స్థిరముగా వెలసి ఉండుగాక.

- - - --- - - -

05. కంబావతీవ సవిడంబా గళేన నవ తుంబాభ వీణ సవిధా
బింబాధరా వినత శంబాయుధాది నికురుంబా
కదంబ విపినే।
అంబా కురంగ మద జంబాల రోచి రిహ లంబాలకా
దిశతు మే
శం బాహులేయ శశి బింబాభి రామ ముఖ
సంబాధిత స్తనభరా॥

శ్రీదేవి కంఠం శంఖంవలె మనోహరం. లేత సొరకాయ లాంటి చక్కని వీణను ఆమె వహిస్తుంది. ఆమె క్రీ పెదవి అచ్చంగా దొండ పండే. నల్లని ముంగురులు ముఖానికి చక్కని శోభ. చంద్రుడిలా మనోహరమైన ముఖ సీమగల బాలుడైన

కుమారస్వామి తన ఆరు ముఖాలతో స్తన్యపానం చేస్తుండటం వల్ల ఆమె స్తనసీమ బాగా గాసి పొంది ఉంటుంది. కదంబ వనంలో ఉన్న ఆ దేవిని ఇంద్రాది దేవతలుభక్తి ప్రపత్తులతో ప్రార్థిస్తుంటారు. అటువంటి అంబ నాకు శుభాన్ని సమకూర్చు గాక!

శంఖము వలె చక్కని కంఠము కలదై, వీణను చేతిలో ధరించి, దొండపండును పోలిన అధరములతో, ముంగురులతో శోభిల్లే ముఖముతో, షణ్ముఖుడు స్తన్యపానం చేస్తుండగా, కదంబ వన స్థిత అయి ఇంద్రాది దేవతలచే స్తుతించబడే తల్లి నాకు సమస్త సంమంగళములను ప్రసాదించుగాక.

- - - --- - - -

06. దాసాయమాన సుమహాసా కదంబవన వాసా
కుసుంభ సుమనో
వాసా విపంచి కృత రాసా విధూతమధు
మాసారవింద మధురా।
కాసార సూన తతి భాసాఽభిరామ తను రాసార శీత కరుణా
నాసామణి ప్రవర భాసా శివా తిమిర
మాసాదయే దుపరతిమ్॥

జగజ్జనని సురుచిర దరహాసం కుసుమాలకంటె సుకుమారం. అతి మనోహారం. నీప వనంలోనే ఆమె నిత్యవిహారం. కుసుంబా పుష్పాలలోనే ఆమె నిత్య నివాసం. పూల కాంతుల ప్రసారంతో ఆమె శరీరం సులలితంగా ప్రకాశిస్తుంది. వీణా వాదనం ఆమెకు నిత్యామోద విషయం. ఆమె బహిరంతర సౌందర్యం మకరందం కంటె మధురతరం. దయాగుణానికి నిలయం ఆమె హృదయం. ముక్కరలోని మణికాంతులతో మెరిసే ఆమె సౌందర్య అగణ్యం. అటువంటి శివ నా అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించును గాక!

పుష్పముల కంటే సుకుమారమైన దరహాసంతో, నిత్యం నీప వనములలో విహరిస్తూ, కుసుంభ పుష్పాలలో వసించి, లలితమైన శరీరంతో, అత్యంత ఇష్టమైన వీణను మ్రోగిస్తూ, బాహ్య - అంతః సౌందర్యంతో ప్రకాశిస్తూ, దయారసాన్ని కలిగిన హృదయముతో, తన ముక్కెర లోని మణికాంతితో వెలిగే సౌందర్యవతి అయిన పార్వతీ దేవి నా అజ్ఞానమును పటాపంచలు చేయుగాక.

- - - --- - - -

07. న్యంకాకరే వపుషి కంకాళ రక్త పుషి కంకాది పక్షి విషయే
త్వం కామనా మయసి కిం కారణం హృదయ!
పంకారి మే హి గిరిజాం।
శంకాశిలా నిశిత టంకాయమాన పద సంకాశమాన సుమనో
ఝుంకారి భృంగతతి మంకా నుపేత శశి
సంకాశ వక్త్ర కమలాం॥

ఓ హృదయమా! ఈ శరీరం రకరకాల రోగాలకూ కళంకాలకూ నిలయం. అంతేకాదు ఇది జుగుప్సాకరమైన రక్త మాంసాలతో కూడిన ఎముకలగూడు మాత్రమే. చివరకు కాక ఘూకాలు పీక్కు తింటానికి మాత్రమే పనికివస్తుంది. అటువంటి పనికి మాలిన దేహం మీద నీ కెందు కింత మోహం? ఆ దేవీ పాదపద్మాలు భవ బంధాలకు ప్రతి బంధకాలు. ఇహపర సుఖాలకు కాణాచులు. సంశయాలనే పాషాణాలను పగుల గొట్టడంలో అవి పదునైన కాశఉలులే. దేవతలనే తుమ్మెదలు నిత్యం ఆమె పాద పద్మాలను ఆశ్రయించి తరిస్తాయి. చంద్రునిలాగా ఆమె ముఖ శోభ మనోహరంగా వుంటుంది. కనుక ఆ గిరిజాదేవిని ధ్యానిస్తే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. భవబంధాలు తొలగి పోతాయి. మోక్షం కలుగుతుంది.

అనేక రకములైన రోగములకు, కళంకములకు నిలయమై, రక్త మాంసములతో నిండి జుగుప్సాకరమై, కంకాళముగా ఉన్న ఈ శరీరము రాబందులు పీక్కు తినడానికి మాత్రమే ఉపకరిస్తుంది. అటువంటి పనికిమాలిన దేహం మీద ఈ హృదయానికి

ఎందుకు ఇంత మోహం. ఇహ పర సుఖాలను ప్రసాదించే, దేవతలు నిరంతరం ఆశ్రయించే జగన్మాత పాద పద్మాలను ఆశ్రయించు. అత్యంత సుందరమైన ఆమె ముఖమును మదిలో ధ్యానిస్తే మోక్ష ప్రాప్తి కలుగుతుంది.

- - - --- - - -

08. జంభారి కుంభి పృథు కుంభాపహాసి కుచ సంభావ్య
హార లతికా
రంభా కరీంద్ర కర దంభాపహోరుగతి
డింభానురంజిత పదా।
శంభా వుదార పరిరంభాంకుర త్పులక దంభానురాగ పిశునా
శం భాసురాభరణ గుంఫా సదా దిశతు
శుంభాసుర ప్రహరణా॥

దేవేంద్రుడి ఐరావతం యొక్క కుంభ స్థలాన్ని సైతం ఎకసక్కెం చేసే చక్కనైనది ఆమె కుచ సీమ. ఆ స్తన సీమ అందాన్ని మరీ అతిశయింప చేస్తుంది ఆమె మెడలోని మంచి ముత్యాల హారం. ఏనుగు తొండాల కంటే అరటి బోదెలకంటే ఉదాత్తమైనవి ఆమె ఊరువులు. ఎఱ్రగా పసిపాపల పాదాల లాగ ముచ్చట గొలుపుతాయి ఆమె పాదాలు. శంకరుడితోడి గాఢాలింగనంతో ఆమెకు కలిగిన పులకలు, అతడిపట్ల ఆమెకు గల అనురాగానికి సూచికలు. ఆమె అందచందాల ధగధగలకు కారణం ఆమె ధరించిన ఆభరణాలు. శుభాంగి అయిన ఆ మహాదేవి నాకు ఎల్లప్పుడూ శుభాన్నే సమకూర్చుగాక!

ఇంద్రుని వాహనమైన ఐరావత కుంభస్థలాన్ని తలదన్నే వక్షసీమ కలదై, ఆ వక్ష సీమపై అలంకరించబడిన హారములతో, ఏనుగు తొండమువలే ఉదాత్తమైన ఊరువులతో, పసిపాపల పాదములవలె ఎఱ్రని పాదములతో, శివుని కలయికతో కూడిన అనురాగ సూచికలతో, సర్వాభరణములను ధరించి సుందరంగా దర్శనమిచ్చే దేవి నాకు సకల శుభములను కలిగించుగాక.

- - - --- - - -

09. దాక్షాయణీ దనుజ శిక్షా విధౌ వికృత దీక్షా మనోహర గుణా
భిక్షాశినో నటన వీక్షా వినోదముఖి దక్షాధ్వర ప్రహరణా।
వీక్షాం విధేహి మయి దక్షా స్వకీయ జన పక్షా విపక్ష విముఖీ
యక్షేశ సేవిత నిరాక్షేప శక్తి జయ లక్ష్మ్యావధాన కలనా॥

శ్రీదేవికి గల విశేషమైన ఏకైక దీక్ష నిత్య రాక్షస సంహారమే! ఆమె అరి వీర భయంకరి. శివాపరాధం చేసిన వారిని ఎవరినీ ఆమె ససేమిరా క్షమించదు. చివరకు తన తండ్రి అయిన దక్షుడి యజ్ఞాన్ని సైతం ధ్వంసం చేసింది. గతంలో అనేక విజయ పరంపరలను సాధించిన సర్వ సమర్థ. ఉత్తమ గుణవతి. కుబేరుడు ఆమెను నిత్యం భక్తితో అర్చిస్తాడు. ఆమె భక్తుల పాలిటి కొంగు బంగారం. ఆ దాక్షాయణీదేవి నా పట్ల అనుగ్రహ దృష్టిని ప్రసాదించు గాక!

రాక్షస సంహారమే ఏకైక దీక్షగా కలిగి, శివాపరాధం చేసేవారిపట్ల భయంకరురాలై, తన తండ్రియైన దక్షుని యజ్ఞాన్ని సైతం ధ్వంసము చేయించినదై, విజయ సాధనలో నిమగ్నురాలై, శివతాండవాన్ని తిలకించడంలో ఆసక్తి కలదై, కుబేరునితో నిత్యం ఆరాధించబడుతూ, భక్తులను కరుణించే జగన్మాత నాపై తన కరుణా దృష్టిని ప్రసరించు గాక.

- - - --- - - -

10. వందారు లోక వర సందాయినీ విమల కుందావదాత రదనా
బృందారబృంద మణి బృందారవింద
మకరందాభిషిక్త చరణా।
మందానిలా కలిత మందారదామభిర
మందాభిరామ మకుటా
మందాకినీ జవన భిందాన వాచ
మరవిందాసనా దిశతు మే॥

ఆమె పద్మాసన. వందనం చేస్తే చాలు ఆ దేవి వరాలు కురిపిస్తుంది. మల్లె మొగ్గల్లాంటి చక్కనైన పలువరుసతో ఆమె మెరిసిపోతుంది. పద్మాలను అలంకరించుకున్న మణి కిరీటాలతో దేవతలు శిరసులు వంచి నమస్కరిస్తుంటే ఆ పద్మాలలో నుండి జాలువారే మకరంద ధారలతో ఆమెకు పాదాభిషేకం జరుగుతుంది. ఆమె ధరించిన మణి కిరీటాన్ని మందానిలుడు మందారాలతో ముంచెత్తి మరీ మరీ మనోజ్ఞంగా చేస్తాడు. పవిత్రమైన గంగా ప్రవాహ వేగాన్ని మించిన వాగ్ధాటిని ఆ జగన్మాత నాకు ప్రసాదించు గాక!

పద్మములో స్థితురాలై, వందనం చేసే భక్తులను కరుణిస్తూ, అందమైన దంత పంక్తితో మెరిసే, మణి కిరీటములను ధరించిన దేవతలు ఆమె పాదములకు అభిషేకం చేస్తుంటే, మందానిలుడు ఆమె కిరీటాన్ని మందార పుష్పాలతో అలంకరిస్తుంటే ప్రకాశించే మాత, గంగా ప్రవాహ వేగము కంటే ఎక్కువైన వాక్ధాటితో నన్ను అనుగ్రహించుగాక!

- - - --- - - -

11. యత్రాశయో లగతి తత్రాగజా వసతు కుత్రాపి నిస్తుల శుకా
సుత్రామ కాల ముఖ సత్రాసకప్రకర సుత్రాణ కారి చరణా!
ఛత్రానిలాతిరయ పత్త్రాభిరామ గుణ మిత్రామరీ సమ వధూః
కు త్రాసహీన మణి చిత్రాకృతి స్ఫురిత పుత్రాది దాన నిపుణా॥

గిరిజా పాదసేవ ఇంద్రాది దిక్పాలకు లందరి భయాందోళనలను ఇట్టే పోగొడు తుంది. వారి రక్షణ భారాన్ని సర్వాన్నీ సదా ఆమె వహిస్తుంది. ఆమె వహించిన గొడుగు వాయువేగం వల్ల ముందుకు తోస్తుంటే, ఆమె అధివసించిన రథవేగం అధికాధిక మౌతుంది. ఆమెకు మనోహరమైన విలాసవతులూ దేవతా స్త్రీలతో సమానమైన వారూ ఐన చెలికత్తె లెందరో ఉన్నారు. నిర్భయులూ, తేజశ్శాలురూ అయిన రత్నాలవంటి పుత్ర సంతానాన్ని అనుగ్రహిస్తుంది. మరెన్నో సంపదలను ప్రసాదిస్తుంది. చక్కని రాచిలుకను ధరించిన దేవి రూపాన్ని ధ్యానించిన భక్తుల హృదయాలలో ఆమె అధివసించు గాక!

ఇంద్రాది దేవతలు సైతం ఆమె పాద సేవలో రక్షణ పొందుతారు. ఆమె యొక్క ఛత్రపు గాలి వేగమునకు ఆమె రథము వేగంగా ప్రయాణిస్తుంది. ఆ జగన్మాత తేజస్సంపన్నులైన పుత్రసంతానాన్ని అనుగ్రహిస్తుంది. అందమైన చిలుకను చేత ధరించిన దేవి రూపాన్ని ధ్యానములో దర్శించిన భక్తులు హృదయవాసినిగా ఆమె కరుణించుగాక.

- - - --- - - -

12. కూలాతిగామి భయ తూలావళిజ్వలనకీలా నిజస్తుతి విధా
కోలాహలక్షపిత కాలామరీ కుశల కీలాల పోషణ నభా।
స్థూలాకుచే జలద నీలాకచే కలిత లీలా కదంబ విపినే
శూలాయుధప్రణతి శీలా విభాతు హృది శైలాధి రాజ తనయా॥

శ్రీదేవి స్తోత్ర విధాన మహిమ – భక్తుల భయాలనే మిక్కిలి పెద్దవైన దూది రాసులను దహించే భయంకరమైన అగ్నిజ్వాల. దేవతా స్త్రీలకు శుభ పరంపరలనే వర్షాలను వృద్ధిపరచే శ్రావణ మేఘం. అంటే ఎప్పుడూ వారి యోగక్షేమాల బాధ్యతను తానే వహిస్తుంది. ఘన స్తనాలతో తెగబారెడు నల్లని కురులతో ఆమె శోభిస్తుంది. ఆమె నిత్యం కదంబవనంలో విహరిస్తుంది. పరమశివుడి వేషభాషలను విలాసంగా అనుకరిస్తుంది. సదాచార పరాయణ. నిత్యం పరమ శివునికి పాదాభివందనం చేస్తుంది. ఆ పర్వత రాజతనయ పార్వతీదేవి నా హృదయంలో నిలిచి సదా ప్రకాశించును గాక!

దేవీ స్తోత్ర పఠనం భక్తుల భయాలను తొలగిస్తుంది. స్త్రీమూర్తులందరి యోగ క్షేమాలను ఆ తల్లి వహిస్తుంది. నల్లని కేశసంపదతో శోభిల్లే మాత ఈశ్వరుని వేష భాషలను అనుకరిస్తూ, సదాచార పరాయణగా, శివునికి అను నిత్యం పాదాభివందన మాచరించే పార్వతీ దేవి నా హృదయములో కొలువుండుగాక.

- - - --- - - -

13. ఇన్ధాన కీరమణిబన్ధా భవే హృదయబన్ధా వతీవ రసికా
సన్ధావతీ భువన సన్ధారణే ష్యమృత సిన్ధా వుదార నిలయా।
గన్ధానుభావ ముహురన్ధాలి పీత కచబన్ధా సమర్పయతు మే
శం ధామభాను మపి రున్ధాన మాశు పద సన్ధాన మప్యనుగతా॥

రసజ్ఞ అయిన పార్వతీదేవి అందాల రాచిలుకను తన ముంచేతి మీద ధరించి ముచ్చటలు చెబుతుంది. తన హృదయ బంధువైన పరమేశ్వరుడిపట్ల ఆమెకు అత్యంత అనురాగం. తాను నివసించేది అమృత సరస్సులోనే అయినా, అక్కడ సర్వ సుఖాలతో మునిగితేలుతున్నా భక్త రక్షణే ఆమెకు పరమధ్యేయం. భక్తుల చిత్తాలను పరమేశ్వరుని పట్ల లగ్నం చేస్తుంది. పూలలో తిరగటంవల్ల పచ్చటి పుప్పొళ్లు తమ శరీరాలకు అంటుకొన్న తుమ్మెదల గుంపులు వచ్చి వాలటంచేత, సహజ సువాసనలు వెదజల్లే ఆమె కేశపాశం పచ్చగా మారి ప్రకాశిస్తుంది. సూర్యమండల తేజస్సును సైతం అధః కరిస్తాయి ఆమె పాదకాంతులు. ఆమెకు గల ఆశుకవితా శక్తి అమోఘం. దానిని ఆమె నాకు అనుగ్రహించి శుభాన్ని కలిగించుగాక!

అందమైన చిలుక జగన్మాత ముంజేతిపై నిలిచి రకరకాల గాథలను వివరిస్తుంటే, భక్తరక్షణ లక్ష్యంగా తన భక్తుల యొక్క మనస్సులను ఆ తల్లి ఈశ్వరునిపై లగ్నం చేస్తుంది. ఆమె కేశముల పట్ల భ్రమరములు ఆకర్షితులౌతుంటే, ఆమె యొక్క పాదముల కాంతులు సూర్య మండలము తేజస్సును సైతం ధిక్కరిస్తుంటే, అనూహ్యమయిన ప్రకాశముతో ఉన్న దేవి నన్ను అనుగ్రహించుగాక.

- - - --- - - -

ఇతి శ్రీ కాళిదాస విరచిత శ్రీ అశ్వధాటీ స్తోత్రం సంపూర్ణమ్

- - - --- - - -

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)

Kiron Type Institute